# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహిళా సాధికారత దిశగా బీమా సఖీ యోజన ద్వారా భారత్ మరో బలమైన ముందడుగు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
3. **తెలంగాణా రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో కొత్త గృహనిర్మాణ ప్రాజెక్టుల దరఖాస్తులను పరిష్కరించాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు.**
5. **వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**

==========================

మహిళా సాధికారత దిశగా బీమా సఖీ యోజన ద్వారా భారత్ మరో బలమైన ముందడుగు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. హర్యానాలోని పానిపట్‌లో మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత, బీమా అవగాహనను పెంపొందించడానికి రూపొందించిన బీమా సఖీ యోజనను నిన్న ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, మహిళలకు ఆర్థికంగా చేయూత అందించేలా అవకాశాలు కల్పించాలని చెప్పారు. గత 10 ఏళ్లలో మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి సోదరులు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో 24 మంది మంత్రులు ఉండగా... జనసేన పార్టీ నుంచి కె పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రులుగా పని చేస్తున్నారు.

--------------------------

తెలంగాణా రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. హైదరాబాదులోని సచివాలయ ప్రాంగణంలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో 20 అడుగుల ఎత్తుగల తెలంగాణా తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాల ఆహార్యంతో విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్న కంకులు చేతిలో ఉండే విధంగా ఈ విగ్రహాన్ని తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీని సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని అన్నారు. తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం చేసిన వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొంటూ,

వాయిస్ ...29 సెకన్లు

మరోవైపు తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా డిసెంబరు 9వ తేదీన తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. తెలంగాణ తల్లి చిత్రాన్ని బహిరంగంగా లేదా సామాజిక మాధ్యమాల్లో అగౌరవపరచడం, అవమానించడాన్ని నేరంగా పరిగణించనున్నట్లు జీవోలో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త గృహనిర్మాణ ప్రాజెక్టులు, లేఅవుట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ధరఖాస్తులను పరిష్కరించాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థిరాస్తి వ్యాపార ప్రాధికార సంస్థ–ఏపీరెరా వద్ద అపరిష్కృతంగా ఉన్న 85 ధరఖాస్తులని మంత్రి నిన్న పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక నుంచి వారానికి రెండు రోజులపాటు కమిటీ సమావేశమై ధరఖాస్తులని వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. కొత్త ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ల కోసం వ్యాపార సంస్థలు రెరాకు చేసే దరఖాస్తుల్లో పూర్తి సమాచారం అందజేయాలని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధాన్యం కొనుగోళ్ళలో సంస్కరణలు తీసుకొచ్చామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కలిశెట్టిగూడెంలో మంత్రి నిన్న పర్యటించి, స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తడిసిపోకుండా రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది శ్రీకాకుళం జిల్లాలో 5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. తేమ 20శాతం వరకు ఉన్నా ధాన్యం కొంటున్నామని , రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్మవద్దని మంత్రి కోరారు.

---------------------------

వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నెలలో ఒక రోజు వసతి గృహాల తనిఖీలకు కేటాయిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసనసభ్యులందరూ వసతి గృహాలను పరిశీలిస్తారని చెప్పారు. ఈ నెల నుంచే హాస్టళ్లలో పర్యటిస్తామని..

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామన్నారు. ఇందుకోసం 5వేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

దేశంలోని మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యను అభ్యర్థిగా ప్రకటించింది. అలాగే హర్యానా నుంచి రేఖాశర్మ, ఒడిశా నుంచి సుజిత్‌కుమార్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు బిజెపి తెలిపింది. ఇది ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ స్థానాలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభ్యర్థులను ప్రకటించింది. తెలుగు దేశం పార్టీ నుంచి బీద మస్తాన్ రావు, సాన సతీశ్... రాజ్యసభకు పోటీ చేస్తారని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటన విడుదల చేశారు.

---------------------------

ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఎటువంటి వివక్షకు గురి కాకుండా సమాన హక్కులతో జీవించాలన్న అంశంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. మనిషి స్వతంత్రంగా జీవించడానికి , మనుగడ కాపాడుకోవడానికి హక్కులు కలిగి ఉండడం అత్యవసరమని భావించిన ప్రపంచ దేశాలు ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో 1948 డిసెంబర్ 10 వ తేదీన ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అప్పటి నుండి ప్రతి ఏటా ఈ కార్యక్రమం జరుగుతోంది. “తక్షణం మన భవిష్యత్తు, మన హక్కులు “ ఇతివృత్తంతో ఈ ఏడాది మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఇదిలా ఉండగా మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయ మానవ హక్కుల సంఘం ఈ రోజు డిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు.

---------------------------

సంక్రాంతి పండుగ నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రహదారుల మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి. అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతుల పనులపై అమరావతి నుంచి ఆయన దృశ్యమాధ్యమ విధానంలో సమావేశాన్ని నిన్ననిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోజువారీగా రహదారి పనుల ప్రగతిని తెలియజేయాలని సూచించారు. కొత్త సంవత్సరం నుంచి రోడ్ల విషయంలో ఎటువంటి విమర్శలకు తావుండకూడదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 22 వేల 299 కి.మీ. మేర రహదారులు దెబ్బతినగా, వీటిని 861 కోట్ల రూపాయలతో మరమ్మతులు చేయిస్తున్నామని, ఇప్పటి వరకు 2వేల 4వందల 68 కిలో మీటర్ల రహదారులు గుంతల రహితంగా మారాయని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం దొరసాని పల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడుతూ...

..వాయిస్...20 సెకన్లు

---------------------------

రిజర్వ్ బ్యాంకు 26 వ గవర్నర్‌గా రాజస్థాన్ కేడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐ. ఎ. ఎస్. అధికారి సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత్ దాస్ పదవీ కాలం ముగుస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం ఆయన స్థానంలో నూతన గవర్నర్‌ను ఈరోజుతో నియమించింది. మల్హోత్రా ప్రస్తుతం రెవిన్యూ శాఖ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

---------------------------

ఈ నెల 11 నుంచి మూడు రోజులపాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా తొలిరోజు రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లనున్న ముఖ్యమంత్రి .. తర్వాత రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల కేంద్ర మంత్రులు, అధికారులతో చర్చించనున్నారని, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులతోనూ ముఖ్యమంత్రి సమావేశం అయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.

======================